క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పొదలకూరు: పట్టణంలోని పోలేరమ్మతల్లి దేవస్థానం 12 వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమాలకు ఆలయ నిర్మాణదాత పూకోటి లక్ష్మీనారాయణ, కళాభారతి దంపతులు, వారి కుమారుడు, కోడలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు షార్ శాస్త్రవేత్తల ప్రశంసలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న షార్ డిప్యూటీ డైరెక్టర్

పొదలకూరు: అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా గత నెలలో నిర్వహించిన స్పేస్ క్విజ్ మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను షార్ శాస్త్రవేత్తలు మంగళవారం అభినందించారు. క్విజ్‌లో ప్రథమ, తృతీయ స్థానాలు సాధించిన కె.వెంకటేశ్వర్లు (8వ తరగతి), ఎ.సంతోష్ (9వ తరగతి), వారికి గైడ్‌గా వ్యవహరించిన ఫిజికల్ సైన్స్ టీచర్ ఏవీ సుధాకర్‌ను నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో సన్మానించారు. కార్యక్రమంలో షార్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్, మేనేజర్ శేషారెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్ కరుణాకర్‌రెడ్డి, హెచ్ఎం సనత్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాచలం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ సూచించారు. మండలంలోని కసుమూరు పీహెచ్‌సీని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా తదితర వ్యాధుల గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి కీర్తిప్రియ, సీహెచ్‌ఓ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాలను నెల్లూరు ఒకటో, రెండో డిపోల పరిధిలో బుధవారం సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు నిర్వహించనున్నామని మేనేజర్లు శివకేశవ్‌యాదవ్, మురళీకృష్ణ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను తెలియజేయాలని కోరారు. డిపో – 1కు సంబంధించి 99592 25641.. డిపో – 2కు గానూ 99592 25642 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అక్రమాలకు కేరాఫ్ సోమిరెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నెలకే అవినీతి, అక్రమాలకు పాల్పడటాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపాల ఏడుకొండలు ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సోమిరెడ్డి అవినీతి, అక్రమాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సాక్ష్యాధారాలతో సహా ప్రజలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలియజేస్తూనే ఉన్నారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇసుక, మట్టి, ఫ్లై యాష్‌ను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్న మాట వాస్తవం కాదానని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమానని సోమిరెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పంటపాళెంలోని ఆయిల్ ఫ్యాక్టరీల్లో మాఫియా జరుగుతోందని ఆరోపించారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారానని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఎస్సీ సెల్ నేతలు మందాకృష్ణ, నరసయ్య, మనోజ్, శివ, సుబ్బరాయుడు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

నాడు పనులు.. నేడెంతో ఉపయోగం

- మహ్మదాపురంలో భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు
- పైపులైన్ ద్వారా మురుగునీరు బయటకు..
- గత ప్రభుత్వంలోనే పనులు
- ఇరుకు వీధుల్లో ఎంతో ఉపయోగం



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం పైపులైన్ నిర్మిస్తున్న కార్మికులు (ఫైల్)



ఉపయోగించిన పైపులు

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టింది. ఇవి నేడు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నాడు రూ.కోట్లతో పల్లెల్లో డ్రెయినేజీ కాలువల నిర్మాణం జరిగింది. దీంతో నేడు వర్షాకాలం వచ్చినా అంతర్గత రోడ్లకు ఇబ్బంది లేకుండా ఉంది. అయితే ఇరుకు వీధుల్లో డ్రెయినేజీల నిర్మాణం సమస్యగా మారింది. అప్పట్లో అధికారులు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నాటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నుడా నుంచి నిధులు సాధించి గ్రామాల్లో పనులు పూర్తి చేయించారు. ఫలితంగా ఇప్పుడు అడపాదడపా వర్షాలు కురిస్తున్నా ఇబ్బందులు తలెత్తకుండా ఇళ్లలోని మురుగునీరు సునాయాసంగా వెలుపలకు వెళుతోంది.

లక్షల రూపాయలతో..

మండలంలోని మహ్మదాపురం గ్రామంలోనే రూ.27.60 లక్షల నిధులను ఇందుకోసం వెచ్చించారు. ఇలాంటి పనులు రెండు, మూడు గ్రామాల్లోనే చేపట్టారు. డ్రెయినేజీ కాలువల నిర్మాణానికి ఇబ్బందిగా ఉన్న చోట్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టంను ఉపయోగించడం జరిగింది. సాధారణంగా గ్రామాల్లో ఇలాంటివి నిర్మించరు. మహ్మదాపురంలో పొలాల గుండా మురుగునీటిని కాలువలోకి పంపేందుకు అవసరపడడంతో భూగర్భ మురుగునీటి పంపిణీను నిర్మించాల్సి వచ్చింది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామంలో మురుగునీరు బయటకు వెళ్లేందుకు శాశ్వత పరిష్కారాన్ని చూపారు.

ఎవరికీ ఇబ్బంది లేకుండా..

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్ ఏర్పాటు చేసిన మహ్మదాపురం, చెన్నారెడ్డిపల్లి తదితర గ్రామంలో మురుగునీరు సమీపంలోని కాలువల్లో కలపాల్సి ఉంటుంది. అయితే ఓపెన్ డ్రెయినేజీ నిర్మిస్తే సమస్యలు తలెత్తుతాయని ఇంజినీరింగ్ అధికారులు పైపుల ద్వారా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని నిర్మించారు. మురుగు ఎటూ పంపేందుకు వీలు లేకపోవడం వల్ల పొలాల మీదుగా కాలువకు వెళ్లాల్సి రావడంతో ఆ తరహాలో పనులు చేపట్టారు.

ఇందుకోసం రెండు అడుగుల వెడల్పు కలిగిన పైపులను, 336 మీటర్ల పొడవున భూమిలో పెట్టారు. మహ్మదాపురంలో గ్రామంలో మురుగునీరంతా ఒకచోటికి చేరి అండర్ గ్రౌండ్ పైపులైను ద్వారా నెల్లూరు కాలువలో కలుస్తుంది. ఫలితంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు.

నిధులు మంజూరు చేయించారు



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్ నిర్మాణం వల్ల గ్రామంలో సమస్యలు తలెత్తకుండా ఉన్నాయి. మురుగునీరు రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కష్టపడుతున్నాం. ఇందుకోసం అప్పట్లో నుడా నుంచి నిధులను మంజూరు చేయించారు.

– కరిపరెడ్డి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్, మహ్మదాపురం

కోడిపందేల స్థావరంపై దాడులు

పొదలకూరు: మండలంలోని అమ్మవారిపాళెం అటవీ ప్రాంతంలో మంగళవారం కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.7 వేలు నగదు, ఆరు మోటార్‌బైక్‌లు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎస్‌కే హనీఫ్ తెలిపారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



విడవలూరు: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో అంకాళమ్మ పరమేశ్వరి, పోతురాజు పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని గ్రామంలో పండగ వాతావరణం మంగళవారం నెలకొంది. ఈ సందర్భంగా గణపతి పూజ, క్షీరాధివాసం, జలాధివాసం, హోమాలు, పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శివాలయం నుంచి 101 బిందెల్లో నీటిని మహిళలు తీసుకొచ్చి అభిషేకం చేశారు.

వైద్యసేవలందించేందుకు మరింత కృషి



ఆశ కార్యకర్తలతో అధికారులు

ఇందుకూరుపేట: ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్యసేవలను అందించడంలో ఆశ వర్కర్ల పాత్ర కీలకమని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ డేలో ఆయన మాట్లాడారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రభుత్వ వైద్యసేవలను అందించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలను ఆరాతీశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో నిర్వహించిన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో బాగా పనిచేసిన ఆశ కార్యకర్తలను అభినందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీబీ, లెప్రసీ కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెచ్ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ



కొడవలూరు: కర్నూల్లోని మాంటిస్సోరీ ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో సీనియర్స్ విభాగంలో కొడవలూరు మండలం గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా మాస్టర్ జ్యోతి రాజేంద్రకుమార్ ప్రతిభ చూపారు. ఈ క్రమంలో రజత పతకాన్ని కర్నూలు డీఎస్పీ మహబూబ్‌బాషా చేతుల మీదుగా అందుకున్నారు. కాగా ఈయనకు గండవరం ఆయుర్వేద వైద్యాధికారి గీత, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందనలను తెలియజేశారు.

ప్రభుత్వ పథకాలను అందించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ



మాట్లాడుతున్న ఎంపీడీఓ జలజాక్షి

మనుబోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే బాధ్యత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులపై ఉందని ఎంపీడీఓ జలజాక్షి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ గుండాల వజ్రమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ జహీర్ బాషా మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఉపాధి పథకం ఏపీఓ రాజమ్మ మాట్లాడుతూ మండలంలో 7,559 మందికి జాబ్‌కార్డులు జారీ చేశామన్నారు. 5,812 మంది కూలీలు పనులకు హాజరవుతున్నట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీలోగా వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామన్నారు. డీటీ బషీర్ మాట్లాడుతూ త్వరలో గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. మనుబోలు ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు పక్షపాత ధోరణి చూపకుండా పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జట్ల కొండూరు ఉప సర్పంచ్ తులసీరాం మాట్లాడుతూ తమ గ్రామంలో శ్మశాన స్థలం ఆక్రమణకు గురైతే అధికారులకు పిర్యాదు చేసినా స్పందన లేదని వాపోయారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు తిక్కవరపు వెంకటరమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనా నాయక్, సీహెచ్‌ఓ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పక్కాగా వైద్యసేవలు



మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వరి

మనుబోలు: ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పేదలకు పక్కాగా వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె మనుబోలు పీహెచ్‌సీలో జరిగిన ఆశాడేకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలపై దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలం అయినందున పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద ఏఎన్ఎం, ఆశాలు ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారా? అని ఆరా తీశారు. సమావేశంలో డాక్టర్ గేయపూజిత, సీహెచ్‌ఓ రాజయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో..



ఇందుకూరుపేట: కొమరికలో..



బుచ్చిరెడ్డిపాళెం: కోదండరామస్వామి ఆలయంలో..

వ్యవసాయాధికారుల క్షేత్ర సందర్శన



కొడవలూరు: గండవరంలో..



పొదలకూరు: నిమ్మతోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదలకూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కసుపర్తి, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు క్షేత్ర సందర్శన చేశారు. ఏఓ ఎ.వాసు ఆధ్వర్యంలో నిమ్మతోటలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో సమావేశం నిర్వహించారు. నిమ్మతోటలు, సూక్ష్మసేద్యం, రైతులకు అందజేస్తున్న రాయితీలపై జిల్లా ఉద్యానాధికారి ఎం.సుబ్బారెడ్డి వివరించారు. ఏఆర్ఎస్ శాస్త్రవేత్త హసీనా వరి, మినుము, పెసర పంటలను ఆశించే చీడపీడల గురించి వెల్లడించారు. డీఆర్సీ ఏడీఏ సి.మారుతీదేవి మాట్లాడుతూ వివిధ పంటలకు ఆశించే చీడపీడల నిర్ధారణ ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, మినుము, పెసర, వరి విత్తనాలపై ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను వివరించారు. సెరికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ మస్తానయ్య తదితరులు మాట్లాడారు. ఉద్యానాధికారి ఈ.ఆనంద్, డీఆర్సీ ఏఓ మధురిమ తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు: మట్టి నమూనాల ఆధారంగా సాగు చేయడం లాభదాయకమని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని నాయుడుపాళెం, గండవరంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మట్టి పరీక్షల ఫలితాలతో ఎరువుల ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు. పచ్చిరొట్ట విత్తనాల సాగు ద్వారా నేలను సారవంతం చేసుకుంటే ఎరువుల అవసరం తక్కువగా ఉండటంతో పాటు మంచి దిగుబడులను సాధించొచ్చని చెప్పారు. అనంతరం పశుసంవర్ధక శాఖ జేవీఓ వెంకటేశ్వర్లు మాట్లాడారు. మినీ గోకులాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గండవరం సర్పంచ్ రాజకుమారి, వీఏఏలు శ్రావ్య, కవిత, సుజిత్, స్థానిక నేత మాగుంట అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.
- విడవలూరు: మండలంలోని దంపూరు, చౌకచర్ల గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో బీపీటీ – 5204, కేఎన్నెమ్ – 1638 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. యూరియాను అందుబాటులో ఉంచామని, విత్తనాలు అవసరమైన రైతులు సంప్రదించాలని సూచించారు. దంపూరు సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ భానుప్రకాష్, శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.
- ఇందుకూరుపేట: భూసార పరీక్షల ఆధారంగా పంటల్లో ఎరువులను వినియోగించాలని వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కొమరిక, రావూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి, వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.



విడవలూరులో..



ఇందుకూరుపేటలో..

శక్తిస్వరూపిణీ.. ప్రణామం

ఇందుకూరుపేట: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో విశేష పూజలను నిర్వహిస్తున్నారు. అమ్మణ్ణి దర్శనార్థం భక్తులు భారీగా తరలివస్తున్నారు.

- గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి గాయత్రీదేవిగా మంగళవారం దర్శనమిచ్చారు. పూలంగిసేవ, పల్లకిసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా చలువాది సురేష్, లక్ష్మి, ధన్యాసి నాగరాజు, శశికళ, కొత్తకోట వెంకటేశ్వర్లు, చంద్రిక దంపతులు వ్యవహరించారు.
- పల్లిపాడులోని మీనాక్షి సమేత రామేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు కాళికాదేవిగా కటాక్షించారు. ఉభయకర్తలుగా గుమ్మడి ప్రభాకర్, సుమతి వ్యవహరించారు.
- మైపాడు శివాలయంలో కుంకుమార్చన, పల్లకిసేవను జరిపారు. ఉభయకర్తలుగా బండి జనార్దన్‌రెడ్డి, హరిత దంపతులు వ్యవహరించారు.
- గ్రంథాలయం సెంటర్‌లో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.
- మండలంలోని కొమరికలో కొలువైన మొలక పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బత్తిన రవికుమార్‌రెడ్డి, శైలజ, బత్తిన సుమన్‌కుమార్‌రెడ్డి, సింధూజ దంపతులు వ్యవహరించారు.
- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో భండాసురవధ అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
- **బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో స్వామివారు మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు.
- **పొదలకూరు:** పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, పల్లకి సేవలు జరిగాయి. రాచపూటి రామలింగయ్య ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక దేవాంగవీధిలో రామలింగేశ్వర సమేత చాముండేశ్వరీదేవి ఆలయంలో పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా కొండా సుబ్బారెడ్డి – నీలమ వ్యవహరించారు. రాత్రి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.
- శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- ఇనుకుర్తి గ్రామంలో అవధూత ఆదిపరాశక్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో మహాలక్ష్మీదేవీ అలంకారం చేపట్టారు.
- **మనుబోలు:** మండల కేంద్రమైన మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు పంచామృతాభిషేకం చేశబుూరు. ఉభయకర్తలుగా నంధ్యాల రాజగోపాల్ – బత్తెమ్మ దంపతులు వ్యవహరించారు.
- **ముత్తుకూరు:** మండలంలోని కృష్ణపట్నం, బ్రహ్మదేవి, వల్లూరు, ఈపూరు, పిడతాపోలూరు, పైనాపురం, పోలంరాజుగుంట తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు.



ముత్తుకూరు మండలంలో..



పొదలకూరు: గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



మనుబోలు: మహాలక్ష్మి అలంకారంలో..